క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ప్రతాప్ ఎన్నికల ప్రచారం

చాట్రాయి: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆరుగొలనుపేట, జనార్ధనవరం గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ తెలిపారు. గురువారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించే ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

మకర తోరణం అలంకరణ



మైలవరం: మైలవరం తారకరామా నగర్‌లోని అభయాంజనేయస్వామి వారికి ఉగాదిని పురస్కరించుకుని మకర తోరణం అలంకరించామని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. శ్రీరామ నవమి రోజున స్వామి వారి కల్యాణం అనంతరం సాయంత్రం అన్నదానం జరుగుతుందన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



తిరువూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని రామలింగేశ్వరాలయంలో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం దేవాదాయ శాఖ అధికారులు లెక్కించారు. ఏడు నెలలకు గాను రూ.లక్షా 16 వేల 284 ఆదాయం లభించిందని ఆలయ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ చైర్మన్ తిరుమలశెట్టి వేణుబాబు, సభ్యులు కిషోర్, సాంబశివరావు, లావణ్య, అర్చకులు రాధాకృష్ణ, రాము, వేణు పాల్గొన్నారు. పుట్రేల మారెమ్మ తల్లి దేవస్థానం కార్యనిర్వహణాధికారి సీతారామయ్య పర్యవేక్షించారు.

స్విమ్మింగ్ పూల్ ప్రారంభం



నూజివీడు: పట్టణంలోని బిస్ స్కూల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన హిమాలయ స్విమ్మింగ్ పూల్‌ను బుధవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూజివీడు ప్రాంతంలోని పిల్లలకు ఈతను నేర్పడానికి స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పిళ్లా చరణ్, కాలి సురేష్, తలారి సతీష్, హరికోటి ప్రసాద్, చేబత్తిన మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళం



తిరువూరు: స్థానిక పాటిమీద దాసాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి పలువురు దాతలు బుధవారం విరాళాలు అందజేశారు. వెల్లంకి సుదీప్తి, సంకా మల్లికార్జున రాంబాబు, కొల్లిపర సుబ్బారావు, గుడిమెట్ల చిన వెంకటేశ్వరరావులు రూ.లక్ష చొప్పున విరాళాలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందజేశారు. కస్తాల మహేష్ రూ.50 వేలను ఆలయ నిర్మాణ నిమిత్తం విరాళంగా ఇచ్చారు. నాళ్ల ఆంజనేయులు ఆలయ నిర్మాణ వ్యయంలో పదిశాతం భరించేందుకు ముందుకు వచ్చారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ఎజెండా

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు
- తిరువూరు మూడో వార్డులో ఎన్నికల ప్రచారం

తిరువూరు: పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ఎజెండా అని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరు మూడో వార్డులో బుధవారం స్వామిదాసు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కులాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన నవరత్న పథకాలతో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా రాజకీయాల కతీతంగా అన్ని కుటుంబాలూ లబ్ధి పొందాయని వివరించారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన పథకాలు నవరత్నాలకు కాపీగా ఉన్నాయని, గతంలో పేదల సంక్షేమాన్ని విస్మరించిన చంద్రబాబు ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వలంటీర్లపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు ఆ వ్యవస్థను కొనసాగిస్తామని, నెలకు రూ.10 వేలు జీతం ఇస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయతను గుర్తించి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని కోరారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



తిరువూరు 3వ వార్డులో స్వామిదాసు ఎన్నికల ప్రచారం

పేదోడిని.. ఆశీర్వదించి గెలిపించండి

- మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు
- గొల్లపూడిలో ఎన్నికల ప్రచారం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): సామాన్యుడిని..పేదవాడినైన తనను ఆశీర్వదించి గెలిపించండి. తద్వారా ప్రజా సేవ చేసుకునే భాగ్యం కల్పించండి అని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కోరారు. బుధవారం సాయంత్రం గొల్లపూడి పంచాయతీ పరిధిలోని దర్గా దళితవాడలో ఆయన పర్యటించారు. హారతులిచ్చి స్వాగతం పలికిన మహిళలు తమ మంచి నీటి కొరత తీర్చాలని విజ్ఞప్తి చేశారు. గొల్లపూడి సాయిపురం కాలనీలో నూతనంగా వాటర్ ఫిల్టర్ బెడ్ నిర్మిస్తున్నామని, త్వరలో తాగు నీటి సమస్య పరిష్కారమవుతుందని తిరుపతిరావు వారికి హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో వాటర్ ట్యాంక్ నిర్మించి ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఓటర్లు అందరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి పేదల పక్షపాతి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, ఇక్కడ స్థానిక ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన తాము జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని స్థానికులు ముక్తకంఠంతో చెప్పారు. ముఖ్యంగా తమ సొంత ఇంటి కల నెరవేర్చిన జగనన్న ప్రభుత్వాన్ని కాకుండా మరొకరిని గెలిపించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

వలంటీర్లపై విషం కక్కిన చంద్రబాబును నమ్మకండి..

గడిచిన నాలుగున్నరేళ్ల నుంచి వలంటీర్ వ్యవస్థపై విషం కక్కిన చంద్రబాబు ఇప్పుడు వలంటీర్ల గౌరవ వేతనాన్ని రూ.10 వేలు చేస్తానని చెప్పటం విడ్డూరంగా ఉందని, అతని మోసపు మాటలను నమ్మవద్దని సర్నాల తిరుపతిరావు అన్నారు. గోనె సంచులు మోస్తున్నారని చంద్రబాబు, ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని పవన్ కల్యాణ్ ఇలా అనేక అసత్య ఆరోపణలతో మానసిక క్షోభకు గురి చేసిన వారిని వలంటీర్లు నమ్మే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు, అతని దత్తపుత్రుడు చేసిన అనుచిత వ్యాఖ్యలతో మనస్తాపం చెందిన వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేసి తిరుగుబాటు చేయడంతో వారికి దిమ్మ తిరిగి బొమ్మ కనబడిందని, దాంతో ఇప్పుడు వారిపై ప్రేమ ఒలకబోస్తూ కొత్త రాగం అందుకున్నారని ఎద్దేవా చేశారు. జూన్ 4న జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, వలంటీర్లు మళ్లీ ప్రజలతో మమేకమై సేవలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్, గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న తిరుపతిరావు

నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలి

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని జూపూడి, కిలేశపురం గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఏసీపీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సీవిల్, ఏఆర్, పారామిలటరీ పోలీసులు సుమారు 100 మంది గ్రామాల్లోని వీధుల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఏసీపీ ప్రజలను కోరారు. కులం, మతం, ప్రాంతం ప్రాతిపదికగా ఓటర్లను ఎవరైనా ప్రలోభ పెడితే పోలీసులను ఆశ్రయించాలని, అలా ఆశ్రయించిన వారికి రక్షణ కల్పిస్తామని చెప్పారు. నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ ఎం.సత్యనారాయణ, ఎస్‌ఐ పాపారావు, పారామిలటరీ దళం అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు..

తిరువూరురూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తిరువూరు మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. సీఆర్పీఎఫ్ జవాన్లు వామకుంట్ల, ముష్టికుంట్ల, గానుగపాడు గ్రామాల్లో ఈ కవాతు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, అనవసర వివాదాల్లో తలదూర్చవద్దని గ్రామస్తులకు తిరువూరు ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

- **ముసునూరు:** ప్రజలందరూ ఎన్నికలపై సమగ్ర అవగాహనతో, సజావుగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. బుధవారం సాయంత్రం ఎస్‌ఐ పి.వాసు ఆధ్వర్యంలో ముసునూరు ప్రధాన కూడలి కేంద్రాల్లో ఓటర్లకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం పోలీస్ బెటాలియన్‌తో కలిసి వీధుల్లో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వివాదాలు, ఘర్షణలు తలెత్తకుండా నివారించేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టామన్నారు.

మండలంలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీస్ దళాలు అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటున్న దృష్ట్యా ప్రజలు ఎలాంటి అపోహ, సంకోచం లేకుండా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నాగ ఫణిభూషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.



తిరువూరు మండలంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



కిలేశపురంలో కవాతు నిర్వహిస్తున్న ఏసీపీ మురళీకృష్ణారెడ్డి, సీఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది

సర్నాల విజయానికి బీసీలు ఐక్యంగా పనిచేయాలి

మైలవరం: వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజయానికి బీసీలు ఐక్యంగా పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు నిడుముక్కల శివశంకరరావు అన్నారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావును బీసీ రాష్ట్ర, జిల్లా నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి జగన్ ఎంతో నమ్మకంతో మైలవరం ఎమ్మెల్యే సీటును బీసీకి కేటాయించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, స్థానికుడు, మనందరి వాడు సర్నాల తిరుపతిరావును గెలిపించి సీఎం జగన్‌కు బహుమతిగా ఇవ్వాలని కోరారు. బీసీ సంఘం నాయకులు జగదీష్, పోతురాజు సురేష్, చెన్నూరి సుబ్బారావు, పి. శ్రీనివాస్, వీరంకి శ్రీధర్, మంగన సాయితేజ, టి. తిరుపతిరావు, కరణం అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిరావును సత్కరిస్తున్న బీసీ నాయకులు

గ్రామ వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



రాజీనామా పత్రాలను ఎంపీడీఓ పరమాత్మకు అందజేస్తున్న పోలిశెట్టిపాడు వలంటీర్లు

ఎ.కొండూరు: మండలంలోని పోలిశెట్టిపాడు గ్రామ వలంటీర్లు 14 మంది బుధవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ పరమాత్మకు అందించారు. వలంటీర్లు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేస్తుంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు నిందలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేమంతా స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నామని చెప్పారు.

నరసాపురంలో 25 మంది రాజీనామా..

విస్సన్నపేట: మండలంలోని నరసాపురం గ్రామ సచివాలయం 1, 2 పరిధిలో పనిచేస్తున్న 25 మంది గ్రామ వలంటీర్లు బుధవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు వారి రాజీనామా పత్రాలను ఎంపీడీఓ జి. విజయకుమారికి అందజేశారు.

దేవరగుంటలో 14 మంది రాజీనామా

నూజివీడు: మండలంలోని దేవరగుంటకు చెందిన వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. గ్రామంలోని 14మంది వలంటీర్లు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల తీరుకు నిరసనగా ఎంపీడీఓ కె. కిరణ్‌కుమార్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమపై అన్యాయంగా నెపం వేస్తూ దారుణంగా ప్రవర్తిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు.



నరసాపురంలో రాజీనామా పత్రాలను ఎంపీడీఓ విజయకుమారికి అందజేస్తున్న వలంటీర్లు



ఎంపీడీఓ కిరణ్‌కుమార్‌కు రాజీనామా పత్రాలను అందజేస్తున్న దేవరగుంట వలంటీర్లు

శునకాల స్వైరవిహారం

మూగజీవాలపై వరుస దాడులు

ముసునూరు: వీధి శునకాలు స్వైరవిహారం చేస్తూ గ్రామస్తులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వాటి బారిన పడి పశు, పక్ష్యాదులు తీవ్రగాయాల పాలవుతున్నాయి. కొన్ని మృత్యువాత పడిన ఘటనలు ముసునూరులో చోటుచేసుకున్నాయి. గ్రామంలో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ గత మూడు రోజులుగా ఆవులు, గేదెలు, గొర్రెలు, కోడి పుంజులపై వరుసగా దాడులు చేస్తున్నాయి. బడిపాటి సుగుణరావుకు చెందిన పాడి గేదె, గొల్లపల్లి మధు, సగ్గుర్తి సుగుణరావు, చలపాటి నల్లయ్యకు చెందిన మూడు దూడలు, మద్దాల శౌరికి చెందిన రెండు గొర్రెలు, కొడవలి డేవిడ్‌కు చెందిన ఒక ఆవు, రెండు కోడిపుంజులపై దాడులు చేసి, గాయపర్చాయి. తీవ్రగాయాల పాలైన ఐదు పశువులు మృత్యువాత పడగా, దూడ అపస్మారక స్థితిలో ఉంది. వీధి శునకాల నియంత్రణకు గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కుక్కల దాడికి గురైన దూడ

సరిహద్దు చెక్‌పోస్టులలో తనిఖీలు



తిరువూరు: ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, నగదు రవాణాను అరికట్టేందుకు తిరువూరు సర్కిల్‌లోని తెలంగాణ సరిహద్దు గ్రామాలలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ కె. విజయ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తిరువూరు మండలం రాజుపేట, విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి గ్రామాల్లోని ఆంధ్రా–తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టులలో రికార్డులను పరిశీలించారు. వాహనాల తనిఖీ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. అసిస్టెంట్ సూపరింటిండెంట్ భార్గవ, సీఐ నాగవల్లి, తిరువూరు ఎస్ఈబీ ఎస్‌ఐ అశోక్ పాల్గొన్నారు.

వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా..

ముసునూరు: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లను, వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, జిల్లా డెప్యూటీ లేబర్ కమిషనర్ పి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలోని బృందం ముసునూరు, కాట్రేనిపాడు కూడలి కేంద్రాల్లో సిబ్బందితో కలిసి పలు వాహనాలను పరిశీలించి, తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలం అంతటా అక్రమ మద్యం, నగదు రవాణాపై విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక, గ్రామాలను సైతం గుర్తించి పూర్తి నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో ముసునూరు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో స్వీపర్‌కు గాయాలు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డిపోలో స్వీపర్‌గా పనిచేస్తున్న మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆర్టీసీ డిపోలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లి బీకాలనీకి చెందిన సాలి మేరిమ్మ ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తోంది. కార్యాలయాన్ని శుభ్రం చేస్తుండగా కరెంట్ వైర్లు ఆమె కాలికి తగిలి విద్యుదాఘాతానికి గురైంది. అక్కడున్న వారు ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి 108 వాహనంలో చికిత్స నిమిత్తం విజయవాడ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ పాపారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

14న విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమావేశం

తిరువూరు: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14న తిరువూరు నియోజకవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆర్ఆర్‌కే చారి తెలిపారు. తిరువూరు బైపాస్‌రోడ్డులోని సూర్య ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి జిల్లా, రాష్ట్ర నాయకులు హాజరవుతారని చెప్పారు.

బలహీన వర్గాలపై చంద్రబాబుది కపట ప్రేమ

ఆగిరిపల్లి: బలహీన వర్గాలపై చంద్రబాబుది కపట ప్రేమ అని, ఆయనను నమ్మితే నడిసంద్రంలో మునిగినట్టేనని టీడీపీ రెబల్ అభ్యర్థి ముద్రబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం సాయంత్రం ఎస్‌పేట, పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాలకు తెలుగుదేశం పార్టీలో తీరని అన్యాయం జరుగుతోందన్నారు. నూజివీడు నియోజకవర్గంలో పదేళ్ల పాటు తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసిన తనకు టికెట్ నిరాకరించడం అన్యాయమని ధ్వజమెత్తారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి చంద్రబాబుకు తన సత్తా ఏంటో చూపిస్తానని ఆయన హెచ్చరించారు.

ఎంపీపీ పాఠశాలలో రంజాన్ వేడుకలు



కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం ఎంపీపీ పాఠశాలలో బుధవారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా విద్యార్థులకు సేమియా ప్యాకెట్లు పంపిణీ చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ సోదర భావంతో మెలగాలన్నారు. 30 రోజులు పాటు ఉపవాస దీక్షలు చేయడం ద్వారా ఆకలి విలువ తెలుస్తుందన్నారు. హెచ్ఎం నాగమల్లేశ్వరి, విద్యా కమిటీ చైర్మన్ నూర్జహాన్, ఉపాధ్యాయులు అనూరాధ, భవానీ పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో ఇఫ్తార్ విందు



రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చినపల్లి గ్రామంలో బుధవారం జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి రంజాన్ తోఫాను అందజేశారు. అలాగే రెడ్డిగూడెంలో మతగురువు మౌలానా సీమ్ ఆధ్వర్యంలో రెడ్డిగూడెం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, మండల పార్టీ కన్వీనర్ బలగాని తిరుపతిరావు, వివిధ విభాగాల నాయకులు ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, బత్తుల శ్రీనివాసరెడ్డి, బత్తుల వెంకటేశ్వరరెడ్డి, ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చింతలవల్లి (ముసునూరు): చింతలవల్లికి చెందిన ఎలికే ఏసు (45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ సుధాకర్, సొసైటీ మాజీ అధ్యక్షుడు సుగసాని శ్రీనివాసరావు బుధవారం మృతుని ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.ఏడు వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు జోనుబోయిన కృష్ణ, సచివాలయ కన్వీనర్లు దువ్వూరి లక్ష్మణరావు, తొర్లపాటి శ్రీనివాసరావు, గృహసారథి నాగరాజు, నాయకులు మారుమూడి రవీంద్రబాబు, సుందరరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.